క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణం



ముత్తుకూరులో వేసిన సీసీ రోడ్డు

ముత్తుకూరు: ఇరుకుగా ఉన్న ముత్తుకూరులోని రోడ్డులో ఆక్రమణలు తొలగించే కార్యక్రమం పూర్తి కాగానే సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువపై నిర్మించిన మెట్లను, ఇతర కట్టడాలను యంత్రాల ద్వారా తొలగించడం పూర్తి చేశారు. దీనితో నెల్లూరు నుంచి ముత్తుకూరు మీదుగా సర్వేపల్లి, వెంకటాచలం వరకు రూ.12 కోట్లతో ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా ముత్తుకూరు, సర్వేపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోంది. ఈ మేరకు ముత్తుకూరులో రోడ్డు నిర్మాణం వేగవంతం చేశారు. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో ఈ విస్తరణ పనులు జరుగుతున్నాయి.

విడవలూరు ఎస్సైగా ఆంజనేయులు



బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): విడవలూరు నూతన ఎస్సైగా ఎం.ఆంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడా కోడిపందాలు, పేకాట నిర్వహించకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

'స్పందన'కు వినతులు

పొదలకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన 'స్పందన' కార్యక్రమంలో రైతులు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఆర్‌ఐ నవీన్ వినతిపత్రాలను స్వీకరించారు. సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు, పాస్‌పుస్తకాలు కోసం, ఇతర సమస్యలపై రైతులు వినతిపత్రాలు సమర్పించారు.

యువకులపై దాడి

నెల్లూరు(క్రైమ్): యువకులపై కొందరు దాడి చేసి గాయపర్చిన ఘటన రామ్‌నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. రామ్‌నగర్ పరిధిలోని రైల్వే‌ట్రాక్ సమీపంలో నివాసం ఉంటున్న అబ్దుల్, అతని స్నేహితులు వెంకటసుబ్బయ్య, కరణజానీ, రవికుమార్ ఎంజీబీ మాల్లోని కార్ వాష్‌లో పనిచేస్తున్నారు. పనులు ముగించుకొని వీరు బయల్దేరారు. సాయిబాబా మందిర సమీపంలోకి వచ్చేసరికి మద్యం మత్తులో ఉన్న అదే ప్రాంతానికి చెందిన కల్యాణ్, సంతోష్, చంటి, మరికొందరు వారిని అడ్డుకొని ఇటుగా వెళ్లడానికి లేదంటూ ఘర్షణకు దిగారు. అనంతరం అక్కడే ఉన్న రాడ్లు, కేబుల్ వైర్లు, రాళ్లతో వారిపై దాడి చేశారు. దీంతో బాధితులు పెద్దగా కేకలేయడంతో స్థానికులు రావడాన్ని గమనించిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన అబ్దుల్, వెంకటసుబ్బయ్యను మిగిలిన స్నేహితులు హుటాహుటిన చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్గామిట్ట ఎస్సై సుబ్రహ్మణ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దౌర్జన్యం

నెల్లూరు(క్రైమ్): వివాహితను ఆమె బంధువులు అడ్డగించి అసభ్య పదజాలంతో దూషించి దౌర్జన్యానికి పాల్పడిన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జనార్దన్‌రెడ్డికాలనీకి చెందిన హసీనా, సందానీ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. వీరి ఇంటి పక్కనే బంధువు ఖుర్షీదా బేగం నివాసం ఉంటున్నారు. ఆమె కుటుంబంలోనూ చిన్నపిల్లలున్నారు. పిల్లల విషయాల్లో ఇరు కుటుంబాల నడుమ మనస్పర్ధలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి హసీనా ఇంటికెళ్తుండగా, ఖుర్షీదాబేగం, ఆమె భర్త గౌస్‌మొహిద్దీన్, కుమారుడు షబ్బీర్ అడ్డుకున్నారు. అసభ్య పదజాలంతో దూషించి ఆమెపై దౌర్జన్యం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి ఘటనపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై కొందరు దాడి చేసి గాయపర్చిన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసును సోమవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంకటేశ్వరపురానికి చెందిన రారాజు గతంలో హోమియో హాస్పిటల్లో పనిచేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నారు. ఆయన తల్లి వెంకటేశ్వరపురం బ్రిడ్జి వద్ద బంకును నిర్వహిస్తున్నారు. స్థానికంగా ఉన్న సుధీర్, సల్మాన్‌తో రారాజుకు విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో తన తల్లిని చూసేందుకు బంకు వద్దకు ఆదివారం వెళ్లగా, సుధీర్, సల్మాన్, మరికొందరు అతనిపై దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై రమేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఘటన వెంకటేశ్వరపురంలోని విజయ డెయిరీ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. విజయ డెయిరీ సమీపంలో శ్రీనివాసులు కుటుంబం నివాసం ఉంటోంది. వెంకటేశ్వరపురానికి చెందిన రారాజు, అతని ఇద్దరు భార్యలు అకారణంగా శ్రీనివాసులుతో గొడవపడి కర్రతో దాడి చేశారు. దీంతో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ–క్రాప్‌తో ప్రభుత్వ రాయితీలు

- కలెక్టర్ చక్రధర్‌బాబు



ఈ-క్రాప్‌లో నమోదైన రైతు వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): ఈ-క్రాప్ నమోదుతో రైతులకు ప్రభుత్వ రాయితీలు, పథకాలు లభిస్తాయని కలెక్టర్ చక్రధర్‌బాబు తెలిపారు. విడవలూరు మండలంలోని పార్లపల్లి, విడవలూరు, ఊటుకూరు గ్రామాల్లో సోమవారం కలెక్టర్ పర్యటించి ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులతో నేరుగా మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఈ-క్రాప్‌లో జరిగిన అవకతవకల కారణంగా ఈసారి ఈ-క్రాప్ నమోదును పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఈ-క్రాప్‌లో నమోదైన రైతుల్లో విడవలూరు మండలం నుంచి దాదాపు 23 మంది రైతులను విచారించాలని ఆదేశాలందాయన్నారు. వీరు నిజమైన రైతులా, వీరు పండిస్తున్న పంట వివరాలు, ఎన్ని హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారో పూర్తి వివరాలను సేకరించినట్లు తెలిపారు. మండలంలో ఇప్పటివరకు దాదాపు 80 శాతం మాత్రమే ఈ-క్రాప్ నమోదు చేసుకున్నారని, మిగిలిన 20 శాతం మంది రైతులు కూడా త్వరగా ఈ-క్రాప్‌లో వారి పూర్తి వివరాలతోపాటు పంట వివరాలు కూడా నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఈకేవైసీ కూడా తప్పనిసరి అన్నారు. ఈ-క్రాప్‌లో నమోదైన రైతులకు మాత్రమే రైతుభరోసా, పంట రుణాలు, పంట నష్టం బీమా వర్తిస్తాయని, ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ-క్రాప్‌లో నమోదు కాకపోతే ప్రభుత్వ రాయితీలకు రైతులు దూరమవుతారన్నారు. ఈ-క్రాప్ నమోదు విషయంతో వ్యవసాయశాఖ విస్తరణ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట డీఏఓ సుధాకర్‌రాజు, కోవూరు ఏడీఏ సుజాత, ఏఓ వెంకటకృష్ణయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఉన్నారు.

దిశ యాప్‌ను వినియోగించుకోండి

- జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్

ముత్తుకూరు: యువతులు, బాలికలకు కష్టం వస్తే దిశ యాప్‌ను వినియోగించుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్ సూచించారు. ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం జరిగిన 'బేటీ బచావో - బేటీ పడావో' అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలికలు తమను తాము రక్షించుకొనే స్థాయికి ఎదగాలని సూచించారు. మంచి-చెడు స్పర్శల పట్ల జాగ్రత్తగా ఉండాలని హితవు చెప్పారు. ప్రస్తుత జనాభాలో అబ్బాయిలు, అమ్మాయిల నిష్పత్తి 1000 : 931గా ఉందని, ఈ దశలో అమ్మాయిలను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. దిశ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుజాత, ఐసీడీఎస్ సిబ్బంది వీవీ రత్నం, సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ



పత్తి సాగు కోసంగా ప్రభుత్వ భూమిని చదును చేసిన ఆక్రమణదారులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని పెనుబల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 81.2ఏ లోని 3.1 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానికులు కొందరు ఆక్రమించుకుని పత్తి పంట సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారని సర్పంచ్ ఓడా పెంచలయ్య సోమవారం తహసీల్దార్ పద్మజ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గతంలో ఈ సర్వే నంబర్‌లో ఉన్న భూమిని స్థానికులు కొందరు ఆక్రమించుకుని సాగు చేసుకుంటుండేవారని తెలిపారు. అయితే గ్రామంలోని ఇళ్ల స్థలాలు లేని వారికి ఈ ప్రభుత్వ స్థలాన్ని ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని ప్రతిపాదనలు పంపామన్నారు. ఇందులో భాగంగా ఈ భూమిలో ఎలాంటి సాగు లేకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారని, అయితే ప్రస్తుతం ఈ భూమి నిరుపయోగంగా ఉండడంతో ఆక్రమణదారులు మళ్లీ ఈ భూమిలో పత్తి సాగు చేసేందుకు పనులు ప్రారంభించారని తెలిపారు. దీనిపై తహసీల్దార్‌కు సమాచారం అందించామన్నారు. ఈ ప్రభుత్వ భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరారు.

వరికి అగ్గితెగులు బెడద



వల్లూరులో వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ముత్తుకూరు: రబీ సీజన్‌లో వేసిన వరి పైరుకు అగ్గి తెగులు బెడద పొంచి ఉందని ఇందుకూరుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్‌కుమార్ అన్నారు. మండల వ్యవసాయాధికారి జోత్స్నారాణితో కలిసి సోమవారం మండలంలోని వల్లూరు పంచాయతీలో సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా అగ్గితెగులు సోకిన పైరును గుర్తించి రైతులకు సూచనలిచ్చారు. ఈ తెగులును మొదటి దశలోనే నిర్మూలించాలని తెలిపారు. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ మందు ఎకరాకు 120 గ్రాములు, లేకుంటే ఐసోప్రోథంలిన్ మందు 300 మిల్లీగ్రాములు నీటిలో కలిపి, వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఏఏబీ సభ్యుడు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, పోచారెడ్డి చెంగారెడ్డి పాల్గొన్నారు.

డీటీల బాధ్యతల స్వీకరణ

పొదలకూరు: డిప్యూటీ తహసీల్దార్‌గా సాయిగణేష్‌బాబు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన తిరుపతి జిల్లా డక్కిలి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న విధులను సక్రమంగా నిర్వర్తించి సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన డీటీ

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం డిప్యూటీ తహసీల్దార్‌గా విజయ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రేబాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, మిత్రులు డీటీని సత్కరించారు. అనంతరం డీటీ మాట్లాడుతూ గతంలో బుచ్చిరెడ్డిపాళెంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించానని, అనంతరం బదిలీపై వెళ్లి తిరిగి పదోన్నతిపై బుచ్చిరెడ్డిపాళేనికి రావడం సంతోషంగా ఉందన్నారు.

పాఠశాలను కొనసాగించాలని వినతి

మనుబోలు: తమ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలని మండలంలోని గొట్లపాళెం గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ శేషాద్రిసాయిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలో చదివే 6, 7, 8 తరగతుల విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో నిబంధనల ప్రకారం వారిని వేరే పాఠశాలలో చేర్పించి వెళ్లేందుకు ఆటో వసతి కల్పిస్తామని తెలిపారు.

అన్నివిధాలా ఆదుకుంటాం



చెక్కును అందజేస్తున్న విజయారావు

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని ఎస్పీ విజయారావు పేర్కొన్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన తోటపల్లిగూడూరు కానిస్టేబుల్ సుధాకర్ కుమారుడు రిషి, చిల్లకూరు కానిస్టేబుల్ రమణ చెల్లెలు మల్లీశ్వరి, డీసీఓ స్వీపర్ హసీనా కుమారుడు అహ్మద్‌కు రూ.50 వేల చొప్పున చెక్కులను తన చాంబర్‌లో ఎస్పీ సోమవారం అందజేశారు. అనంతరం వారి కుటుంబ యోగక్షేమాలను ఆరాతీశారు. ప్రభుత్వం నుంచి అన్ని సదుపాయాలు త్వరితగతిన వచ్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఏఎస్పీ హిమవతి, పోలీస్ కార్యాలయ ఏఓ విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నెల్లూరు(టౌన్): కష్టపడేతత్వాన్ని చిన్నతనం నుంచే అలవర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆర్‌ఐఓ వరప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని వీపీఆర్ కల్యాణ మండపంలో వర్ధన్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వార్షికోత్సవ సంబరాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. డీవీఈఓ మధుబాబు, నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు శ్రీనివాసులురెడ్డి, వీరాంజనేయరెడ్డి, వర్ధన్ విద్యాసంస్థల అధినేత చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు సాయిహార్దిక్‌రెడ్డి, వర్ధన్‌రెడ్డి, మోటివేటర్ నరసింహారెడ్డి, డీన్లు సత్యశ్యామ్, వెంగళరావు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అనుమానితుల బైండోవర్



అనుమానితులను తహసీల్దారు ఎదుట హాజరుపరుస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

కొడవలూరు: మండలంలోని ఇద్దరు గంజాయి అనుమానిత మహిళలను కోవూరు ఎస్‌ఈబీ అధికారులు కొడవలూరు తహసీల్దార్ రమాదేవి ఎదుట సోమవారం బైండోవర్ చేశారు. కొడవలూరుకు చెందిన చప్పిడి మంగమ్మ, తలమంచికి చెందిన నాగులూరు తిరుపతమ్మలను రూ.2 లక్షల పూచీకత్తు, ఏడాదిపాటు బైండోవర్ అమలులో ఉండేలా తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. గతంలో వీరి వద్ద గంజాయి ఉన్నట్లు ఎస్‌ఈబీ అధికారులు గుర్తించిన నేపథ్యంలో ముందు జాగ్రత్తగా బైండోవర్ చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ ఆర్.నరహరి తెలిపారు. ఎవరైనా నిషేధిత గంజాయి, నాటుసారా, ఇతర రాష్ట్రాల మద్యం కలిగి ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 14500కు లేదా ఎస్‌ఈబీ ఎస్సై 9440902524 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ ఎస్సైలు టి.శ్రీనివాసరావు, డి.శ్రీధర్, కానిస్టేబుల్స్ మస్తానయ్య, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



నగదు చెక్కును అందజేస్తున్న విజయ్‌కుమార్

ఇందుకూరుపేట: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి నుంచి రూ.7 లక్షలు అందింది. మండలంలోని పున్నూరు ఎస్సీకాలనీకి చెందిన బద్దిపూడి మణి మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని ఆయన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బాధితుడి వినతి మేరకు ఎమ్మెల్యే స్పందించి సీఎం సహాయనిధి ద్వారా సాయం అందేలా చర్యలు చేపట్టారు. డీసీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ సోమవారం పున్నూరుకు వెళ్లి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బాధితుడి కుటుంబసభ్యులకు అందజేశారు.

వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు



అర్జీ స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ బుచ్చిరెడ్డిపాళెంలో వీధి వ్యాపారాలకు గుర్తింపు కార్డులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడం వల్ల వారికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించిన ఆమె ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొడవలూరు: స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కొడవలూరు పీహెచ్‌సీ వైద్యబృందం సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. పలువురికి చర్మ సంబంధ సమస్యలున్నట్లు గుర్తించి మందులు అందజేశారు. అలాగే పలువురు విద్యార్థులకు జలుబు, దగ్గు ఉన్నట్లు నిర్ధారించి మందులు ఇచ్చారు. అనంతరం ఆరోగ్య జాగ్రత్తల పట్ల వైద్యాధికారి ఎం.రామకృష్ణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని విద్యార్థులకు సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు సందేహం ఉంటే వెంటనే వార్డెన్ దృష్టికి తీసుకొచ్చి ఆస్పత్రిలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి బాలచంద్రబాబు, హెల్త్ సూపర్‌వైజర్లు పద్మ, సుజాత, హెల్త్ అసిస్టెంట్ షఫీఉద్దీన్, ఏఎన్‌ఎంలు శేషబాయి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తిస్తున్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుచ్చిరెడ్డిపాళెంలోని జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే జోన్లను సోమవారం మోటార్ వెహికల్ అధికారులు, పోలీసులతో కలిసి ఆయన గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై ఇటీవల జిల్లాలోని అన్ని నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారని తెలిపారు. ఇందులో భాగంగా ఎక్కువగా ఎక్కడైతే ప్రమాదాలు జరుగుతున్నాయో ఆ ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారన్నారు. ఇందులో భాగంగా బుచ్చిరెడ్డిపాళెంలోని జాతీయ రహదారిపై పంచేడు జంక్షన్, జొన్నవాడ జంక్షన్ల వద్ద ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని గుర్తించి ఆయా ప్రాంతాల్లో బ్యారికేడ్లు, డివైడర్లు, లైట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని నేషనల్ హైవే అథారిటీ అధికారులకు కూడా తెలియజేశామని, వారు కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆయన వెంట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్సై వీరప్రతాప్ ఉన్నారు.

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేత



నజరున్నీసాకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఆరీఫ్

ఇందుకూరుపేట: మండలంలోని ఇందుకూరుపేటకు చెందిన షేక్ నజరున్నీసాకు స్థానిక వలంటీర్ షేక్ ఆరీఫ్ హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ నగదును అందజేశారు. అనారోగ్యం కారణంగా నజరున్నీసా హైదరాబాద్‌లో బంధువుల ఇంటి వద్ద ఉంటూ చికిత్స తీసుకుంటోంది. ఈ విషయాన్ని డీసీఎంఎస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డికి తెలియజేయగా ఆయన వలంటీర్ ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లే ఏర్పాటు చేసి లబ్ధిదారు నజరున్నీసాకు పింఛన్ అందించేలా చూశారు. తనకు పింఛన్ అందజేసిన వలంటీర్ ఆరీఫ్‌కు, సహకరించిన సురేష్‌రెడ్డికి నజరున్నీసా కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ పోటీలు



మహిళల విభాగంలో విజేత కొత్తూరు జట్టు, రన్నర్ ఊటుకూరు జట్టు

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రిగ్స్ కోవూరు నియోజకవర్గ హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున ప్రారంభించారు. ఈ పోటీల్లో మహిళల విభాగంలో జెడ్పీహెచ్‌ఎస్ కొత్తూరు జట్టు ప్రథమస్థానంలో, జెడ్పీహెచ్‌ఎస్ ఊటుకూరు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. అలాగే పురుషుల విభాగంలో ఏపీటీడబ్ల్యూఆర్‌ఎస్ జట్టు ప్రథమస్థానంలో, జెడ్పీహెచ్‌ఎస్ కొత్తూరు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు అరోరా, కృష్ణమోహన్, శ్రీనివాసులు, జ్యోతి, పల్లవి, రమేష్‌బాబు, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజీ చేసుకుందామని పిలిచి హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): కేసును రాజీ చేసుకుందామని స్నేహితుడ్ని పిలిచి కొందరు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెంలోని గాంధీనగర్‌కు చెందిన రేవంత్‌కు నగరంలోని పడారుపల్లి, సుందరయ్యకాలనీకి చెందిన గిరి, నాగరాజు స్నేహితులు. గతంలో వీరిపై సంగం పోలీస్‌స్టేషన్లో డెకాయిటీ కేసు ఉంది. అప్పట్లో పోలీసులు వీరిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అనంతరం బెయిల్‌పై బయటకొచ్చారు. డబ్బులు తీసుకొని నెల్లూరొస్తే కేసును రాజీ చేయించుకుందామంటూ రేవంత్‌కు గిరి, నాగరాజు ఫోన్ చేసి చెప్పారు. దీంతో రేవంత్ తన బైక్‌ను కుదువపెట్టి డబ్బులు తీసుకొని నగరానికి వచ్చారు. బాగా పొద్దుపోయే వరకు నగరంలోని ఓ హోటల్లో రేవంత్, గిరి, నాగరాజు, మరో స్నేహితుడు సాయి పూటుగా మద్యం సేవించారు. మద్యం మత్తులో ఉన్న రేవంత్‌ను వారు పడారుపల్లిలోని నీళ్ల ట్యాంక్ వద్దకు తీసుకెళ్లారు. అనంతరం ముగ్గురూ కలిసి అతనిపై విచక్షణరహితంగా దాడి చేశారు. బీర్ బాటిల్‌తో గిరి పొడవబోగా రేవంత్ చేయి అడ్డం పెట్టడంతో మణికట్టుకు తీవ్రగాయమైంది. రేవంత్ కదలకుండా సాయి, నాగరాజు పట్టుకున్నారు. నీ వల్లే జైలుకెళ్లాం.. నువ్వు బతకకూడదంటూ చంపేందుకు గిరి యత్నించగా బాధితుడు పెద్దగా కేకలేశారు. దీంతో అటుగా వెళ్తున్న వారు, చుట్టుపక్కల వారు రావడాన్ని గమనించిన నిందితులు పరారయ్యారు. అనంతరం బాధితుడు డయల్ 112కు ఫోన్ చేశారు. రాత్రి విధుల్లో ఉన్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ నరసింహారావు తన సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనస్థలానికి చేరుకొని క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు నిందితులపై హత్యాయత్నం కేసును నమోదు చేశారు. గంటల వ్యవధిలోనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం. కాగా ప్రధాన నిందితుడైన గిరిపై హత్య కేసు ఉంది.

మిత్ర పురుగులతో పంటకు మేలు



పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఇందుకూరుపేట: పొలాల్లో ఉండే మిత్ర పురుగులను కాపాడుకొంటే అవి పంటకు మేలు చేస్తాయని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని లేబూరు గ్రామంలో సోమవారం 'పొలంబడి' కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టానుసారంగా పురుగుమందులను వినియోగిస్తే శత్రు పురుగులతోపాటు మిత్ర పురుగులు కూడా నశిస్తాయన్నారు. వాటిపై అవగాహన కలిగి కాపాడుకోవాలని సూచించారు. అలాగే తెగుళ్ల లక్షణాలు, నివారణ చర్యలు, సామూహిక ఎలుకల నివారణపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ రాజ్‌కుమార్, వ్యవసాయ సహాయకులు డి.సుమలత, యమున, తిరుమలరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీలో గత రెండు రోజులుగా అన్ని కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. పలు కాలనీల్లో చెత్తాచెదారం నిల్వ, దోమల బెడద ఉందని స్థానికులు సర్పంచ్ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే అన్ని కాలనీల్లో చెత్తాచెదారాలను, సైడు కాలువల్లో పూడికను తొలగించారు. అలాగే ఆదివారం రాత్రి దోమల నియంత్రణకు చర్యలు చేపట్టారు. నివాసాల వద్ద రోజుల తరబడి నీటిని నిల్వ ఉంచుకోవద్దని, ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.